శిథిలావస్థలో చెక్‌డ్యాంలు

- నాసిరకంగా నిర్మాణాలు
- పగుళ్లు ఏర్పడి బీటలు వారిన వైనం
- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- మరమ్మతులు చేపట్టాలని రైతుల విన్నపం

భూగర్భజలాలను పరిరక్షించాలనే లక్ష్యంతో నిర్మించిన చెక్‌డ్యాంలు అధికారుల పర్యవేక్షణ లోపంతో శిథిలావస్థకు చేరాయి. ఏళ్లకాలం వరకు మన్నికగా ఉండాల్సిన చెక్‌డ్యాంలను నాసిరకంగా చేపట్టడంతో అనతికాలంలోనే పగుళ్లు ఏర్పడి బీటలు వారాయి. ఓవైపు అధికారుల నిర్లక్ష్యం.. మరోవైపు కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం రైతుల పాలిట శాపంగా మారింది. ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది.

– కంది (సంగారెడ్డి)



చెర్యాల వాగుపై కూలిపోయిన చెక్‌డ్యాం

అధికారుల పర్యవేక్షణ కరువు..

ఉమ్మడి మెదక్ జిల్లాలో 1000కి పైగా చెక్‌డ్యాంలను నిర్మించగా వీటిలో చాలావరకు పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో చుక్కానీరు నిలువకుండాపోవడంతో పాటు భూగర్భజలాలు పెరిగే అవకాశం లేకుండాపోయింది. భూగర్భ జలాలను పెంచేందుకు వాగులు, చెరువుల కింద నిర్మించిన చెక్‌డ్యాంల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో కొద్దిరోజులకే చెక్‌డ్యాంల గోడలకు పగుళ్లు ఏర్పడి బీటలు వారగా మరికొన్ని వర్షపుధాటికి పూర్తిగా కొట్టుకుపోయాయి. చెక్‌డ్యాంలను పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు తొంగి చూడకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం మరుగున పడింది.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం...

అధికారుల పర్యవేక్షణ కరువడం, కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేపట్టడంతో ప్రజాధనం వృథా అయ్యింది. చెక్‌డ్యాంలను పునాది స్థాయి నుంచి పటిష్టంగా నిర్మించాల్సి ఉన్నా కాంట్రాక్టర్లు కాసులకు కక్కుర్తిపడి తూతూమంత్రంగా పనులు చేపట్టడంతో వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటి ధాటికి చెక్‌డ్యాంలు కొట్టుకుపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

ఒక్కో చెక్‌డ్యాంకు రూ.5లక్షల నుంచి 10 లక్షల ఖర్చు..

భూగర్భజలాలను కాపాడేందుకు ప్రభుత్వం ఒక్కో చెక్‌డ్యాంకు రూ.5లక్షల నుంచి 10 లక్షల ఖర్చు చేసింది. వీటిలో కొన్నింటిని ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించగా మరి కొన్నింటిని ఇరిగేషన్ శాఖ ద్వారా మంజూరైన నిధులతో నిర్మించారు. అయితే సరైన ప్రణాళికలు లేకుండా నీటి ధాటి అధికంగా ఉన్న చోట్ల అధికారులు మార్కింగ్ ఇవ్వడంతో అట్టి స్థలాల్లో నిర్మించిన చెక్‌డ్యాంలు కొద్ది రోజులకే కూలిపోయాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రాబోయే వర్షాకాలంలోనైనా ఎగువ నుంచి వచ్చే వరద నీరు సరైన ప్రాంతాల్లో నిలిచేవిధంగా చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టి శిథిలావస్థకు చేరుకున్న చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

బాగుచేయించాలి



వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలు ఎక్కడికక్కడ కూలిపోతున్నాయి. వచ్చే వర్షాకాలం వరకు సరైన ప్రాంతాల్లో నూతనంగా చెక్‌డ్యాంలను నిర్మాణాలు చేపట్టి మరమ్మతులకు నోచుకోని చెక్‌డ్యాంలను బాగు చేయించాలి. దీంతో భూగర్భజలాలు పెరిగి బోర్లలో నీరు పుష్కలంగా ఉండే అవకాశం ఉంటుంది.

– మల్లేశం, రైతు, కలివేముల గ్రామం

మరమ్మతులు చేయిస్తాం

కొన్నేళ్ల క్రితం నిర్మించిన చెక్‌డ్యాంలు అక్కడక్కడ పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే అవసరమైన చోట మరమ్మతు పనులు చేపడతాం.

– బాలగణేష్, డీఈ, ఇరిగేషన్ శాఖ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శివాలయానికి స్థలం కేటాయించండి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని తాండేలుగుట్టపై వెలసిన జ్యోతిర్లింగ శివాలయానికి ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ జిన్నారానికి చెందిన పలువురు నాయకులు, శివభక్తులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిన్నారంలోని తాంబేలుగుట్టపై శివాలయ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. మరో ఐదెకరాల స్థలాన్ని కేటాయిస్తే దేవాలయానికి సంబంధించి మరిన్ని నిర్మాణాలు చేపట్టవచ్చన్నారు. దీంతో పాటు జిన్నారంలో దివంగత నేతలు విఠల్‌రెడ్డి, వెంకటేశం గుప్తా విగ్రహాలను తహసీల్దార్ కార్యాలయం బయట ఉన్న కాంపౌండ్‌వాల్‌కు ఆనుకొని ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరగా అనుమతులు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. నాయకులు భోజిరెడ్డి, నర్సింహారెడ్డి, రాజిరెడ్డి, భాస్కర్, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధరణి దరఖాస్తులపై విచారణ

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండల పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్ పేట గ్రామంలో తహసీల్దార్ దేవదాస్ సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి పోర్టల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక సభలను నిర్వహిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వట్‌పల్లికి 30 పడకల ఆస్పత్రి

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి మండలంలో 30 పడకల ఆస్పత్రిని మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రూ.11.2 కోట్ల నిధుల మంజూరుతో అనుమతినిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఇచ్చిన హామీ మేరకు ఆస్పత్రిని మంజూరు చేయించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీపీకి సన్మానం

రాయికోడ్(అందోల్): రాయికోడ్ ఎంపీపీగా ఇటీవల ఎన్నికైన మొగులప్పను జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, సింగితం మాజీ సర్పంచ్ సంతోష్ పాటిల్ సోమవారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మండల పశువైద్య అధికారి హర్షవర్ధన్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఎంపీపీని సన్మానించారు. వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎంపీపీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నిరంజన్, శివకుమార్ పాటిల్, కోఆప్షన్ సభ్యుడు అబేద్‌మియా, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పారిశుద్ధ్యం పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సబ్బందితో సోమవారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్యం అమలు తీరును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలని సూచించారు.


పైప్‌లైన్ లీకేజీ పరిశీలన

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు సంబంధించిన కాలనీలో నాలుగు నెలలుగా తాగునీటి పైపు లైన్ లీకవుతూ నీరంతా పక్కనే ఉన్న మురుగుకాలువలోకి వృథాగా పోతోంది. దీంతో కాలనీవాసులు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ దృష్టికి తీసుకెళ్లగా సోమవారం కౌన్సిలర్ వివేకానంద్‌తో కలిసి పైప్ లీకేజీని పరిశీలించారు. అనంతరం నీటిసరఫరా విభాగం ఇన్‌చార్జి శ్రావణ్, మున్సిపల్ సిబ్బందితో కలిసి మరమ్మతులు చేయించారు. శానిటరీ అధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుడి దాడి

కోహీర్(జహీరాబాద్): ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుడు కత్తులతో దాడి చేశాడు. ఈ సంఘటన కోహీర్ మండలం కవేలి గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. బస్సు డ్రైవర్ ఉగ్గు రాచయ్య, ఏఎస్‌ఐ కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్–తొరమామిడి బస్సు కవేలి క్రాస్ రోడ్డు వద్ద ఫ్లైఓవర్ వంతెన దాటుతుండగా ఎదురుగా మోటార్ సైకిల్‌పై వచ్చిన కవేలి గ్రామ నివాసి నిస్సార్ పాష తాగిన మైకంలో గొడవకు దిగాడు. ప్రయాణికులు సహకారంతో ఎలాగోలా నచ్చచెప్పి పంపించి వేశారు. అయితే కోపంతో ఊగిపోతున్న నిసార్ రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కవేలి బస్టాప్ వద్దకు చేరుకొని బండబూతులు తిడుతూ కత్తులతో దాడి చేయడానికి ప్రయత్నించాడు. దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ధైర్యం చేసి అడ్డుకున్న ఇద్దరు మహిళా ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఆర్టీసీ డ్రైవర్ రాచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

బాలికా విద్యకు ప్రోత్సాహం



సైకిళ్లను పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

కోహీర్(జహీరాబాద్): మండల పరిధిలోని పైడిగుమ్మల్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ సభ్యులు విద్యార్థినులకు సోమవారం సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పాటిమీది మహిపాల్‌రెడ్డి, అధ్యక్షులు సంగ్రామ్ పాటిల్, కార్యదర్శి వెంకటేషం, ఎంపీటీసీ జ్ఞానరత్నం, మాజీ సర్పంచ్‌లు జయసింహారెడ్డి, మొల్లయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్‌టీ యూనియన్‌ను గెలిపించాలి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: రాబోయే రోజుల్లో మరిన్ని హక్కులు సాధించేందుకు కృషి చేస్తున్న బీఆర్‌టీ యూనియన్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి బీఆర్‌టీయూ (పెన్నార్ ఇండస్ట్రీస్) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్లుగా పరిశ్రమ గుర్తింపు కార్మిక సంఘంగా బీఆర్‌టీ యూనియన్ కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెడికల్ ఇన్సూరెన్స్ పరిమితిని రూ.2లక్షల నుంచి 3లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. త్వరలో జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో గంట గుర్తుపై ఓటు వేసి బీఆర్‌టీయూను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, పాండు, కార్మిక సంఘం ప్రతినిధులు ఎన్‌వి రావు, లకోష్మరెడ్డి, సోమేశ్వర్, పెంటయ్య, వెంకటేశ్వర్లు, మహేష్, జానకిరామ్, రామ్‌మోహన్‌రావు, శ్రీరామ్‌సింగ్, బివి రావు, కార్మికులు పాల్గొన్నారు.

లైబ్రరీలో సదుపాయాలు కల్పిస్తాం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

నారాయణఖేడ్: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఖేడ్‌లోని లైబ్రరీలో సదుపాయాలు కల్పించడంతో పాటు లైబ్రరీ ఉదయం 10 నుంచి రాత్రి 10వరకు తెరచి ఉంచేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. పలువురు నిరుద్యోగులు, విద్యార్థులు లైబ్రరీలో సదుపాయాలు, లైబ్రరీ సమయాలు పెంచాలని కోరడంతో ఖేడ్ పట్టణంలోని లైబ్రరీని నిరుద్యోగ విద్యార్థులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా లైబ్రేరియన్ వసుంధరకు ఫోన్‌లో మాట్లాడుతూ లైబ్రరీ ఉదయం 10 నుంచి రాత్రి 10వకు తెరచి ఉంచేలా చూడాలని, అవసరమైతే మున్సిపల్ ద్వారా అటెండర్ సదుపాయం, తదితర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్, లైబ్రేరియన్ లలితాబాయి, నారాయణ నాయక్, హన్మంతు ఉన్నారు.

గైర్హాజరైనవారికి నోటీసులు ఇవ్వండి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదు
- అధికారుల తీరుపై ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆగ్రహం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదేశించారు. హత్నూర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నర్సింహులు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకోసారి ప్రజా సమస్యల పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు సమావేశమైతే కనీసం మండల స్థాయి అధికారులు హాజరుకాకపోవడం ఏంటని ప్రశ్నించారు. సమావేశాలకు హాజరుకాని అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని జిల్లా ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేయాలని ఎంపీడీవో శంకర్‌ను ఆదేశించారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ లక్ష్మీకుమార్, తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఎంపీటీసీలు ఆయా శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేస్తేనే అభివృద్ధి

ఎంపీపీ మొగులప్ప, జెడ్పీటీసీ మల్లికార్జున్



రాయికోడ్: మాట్లాడుతున్న ఏఈ ముఖీద్

రాయికోడ్(అందోల్): సమష్టిగా పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ మొగులప్ప, జెడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్ అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన సోమవారం మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహజ్యోతి పథకంలో భాగంగా ఉచిత కరెంటుకు అర్హులైన ఉండి జీరో బిల్లు పొందని వినియోగదారులు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించి తమ వివరాలను అందజేయాలని సూచించారు. సింగితం, నాగన్‌పల్లి గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పలువురు సభ్యులు ఏఈ ముఖిద్‌ను కోరారు. ఉచిత కరెంట్ కోసం 8,042 మంది వినియోగదారులు దరఖాస్తు చేసుకోగా 5,225 మంది వినియోగదారులు అర్హులుగా ఉండగా జీరో బిల్లులు జారీ చేస్తున్నామని ఏఈ తెలిపారు. ధరణిలో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకున్న వారు గ్రామాల్లో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ సమావేశాల్లో తమ దృష్టికి తీసుకురావాలని డీటీ విజయ్‌కుమార్ సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ మసూద్, ఎంపీటీసీలు శివకుమార్, నిరంజన్, నవనీత, సత్తమ్మ, పీహెచ్‌సీ, వెటర్నరీ డాక్టర్‌లు నిఖిల, హర్షవర్ధన్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, ఏపీఓ రమేష్, వివిధ శాఖల అధికారులు ప్రభాకర్‌రెడ్డి, రామ్, కిషన్, శ్యామ్, మల్లేశం, శివకుమార్, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీసీ రోడ్లు నిర్మించేందుకు కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని కాలనీలలో సీసీ రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని 4, 7వ బ్లాక్‌లో సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. నాయకులు షేక్ అలీబాబా, హబీబ్, అబ్దుల్ గఫార్, మల్లికార్జున్, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ న్యాల్‌కల్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చేరిన ఫర్నిచర్

న్యాల్‌కల్(జహీరాబాద్): మన ఊరు–మన బడి పథకంలో భాగంగా మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు ఫర్నిచర్ చేరింది. మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్‌తో పాటు 19 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇప్పటివరకు ఆయా పాఠశాలలకు దాదాపు ఫర్నీచర్ వచ్చింది. న్యాల్‌కల్ జెడ్పీహెచ్‌ఎస్‌కు మాత్రం ఫర్నీచర్ రాకలో కొంత ఆలస్యం జరగగా సోమవారం 267 బెంచీలు పాఠశాలకు వచ్చాయి.

◆ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సన్మానం

నారాయణఖేడ్: ఇటీవల నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారంశంకర్‌ను మేకలు, గొర్రెల పెంపకందారుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్ శెట్టి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ ప్రసాద్, గాలప్ప, సంధాని, గోమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ అభివృద్ధి పనులు ప్రారంభం

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ శేరివెంకట్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బాలయ్య, కార్యదర్శి వీరయ్య, నాయకులు మహిపాల్, కిష్టయ్య, నర్సింలు, వెంకయ్య, జైరాంలు, సంగమేశ్వర్, ఈశ్వరయ్య, దత్తు పాల్గొన్నారు.

◆ పోతన్పల్లి(ఆర్)లో శివలింగ ప్రతిష్టాపన

నారాయణఖేడ్: మండల పరిధిలోని పోతన్‌పల్లి (ఆర్) గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శివలింగ ప్రతిష్టాపన ఉత్సవాలను రెండో రోజైన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపడింతుల ఆధ్వర్యంలో శివలింగ ప్రతిష్టాపనను వైభవంగా నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు నగేశ్‌షెట్కార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్, నాయకులు సాగర్‌షెట్కార్ పాల్గొన్నారు.

◆ పాతకక్షలతో ఇరువర్గాల దాడులు

కల్హేర్(నారాయణఖేడ్): పాతకక్షలతో ఇరువర్గాలు దాడులకు పాల్పడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిర్గాపూర్ మండల పరిధిలోని ఖాజాపూర్‌లో ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన గైని మశ్చేందర్, రసోలం ధన్‌రాజ్ కుటుంబీకులు గొడవపడి రాళ్లు, కట్టెలతో దాడి చేసుకున్నారు. దీంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పలువురిని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ యాజమాన్య పద్ధతులపై అవగాహన

జహీరాబాద్: మండలంలోని చిన్న హైదరాబాద్ గ్రామంలో హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థినులు భాగస్వామ్య గ్రామీణ అంచనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం రూరల్ హార్టికల్చర్ పని అనుభవ శిక్షణ నిమిత్తం రెండు నెలలుగా గ్రామంలో ఉంటూ వారికి కేటాయించిన రైతుల క్షేత్రాలకు వెళ్లి వారు చేపట్టే వివిధ యాజమాన్య పద్ధతులు, మేలకువలు తెలుసుకున్నారు. కళాశాలలో నేర్చుకున్న వివిధ నూతన పద్ధతులపై ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ ప్రదీప్‌కుమార్, ఉద్యాన కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

◆ సదరం క్యాంపు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

హత్నూర(సంగారెడ్డి): దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై శాశ్వత పరిష్కార మార్గానికి సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ చేపట్టిన సదరం క్యాంపు దరఖాస్తు స్వీకరణను సోమవారం ఎమ్మెల్యే సునీతరెడ్డి ప్రారంభించారు. సిరిపుర గ్రామానికి చెందిన సంగన్న గారి వీరగౌడ్ మూడేళ్లుగా మీసేవ చుట్టూ తిరుగుతున్నా స్లాట్ బుక్ కాకపోవడంతో సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఆయన ఇంటికి వెళ్లి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేకంగా దివ్యాంగుల గురించి సంస్థ అధ్యక్షుడు శివశంకర్‌రావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మొదటి రోజు 12 మంది దరఖాస్తులను స్వీకరించినట్లు వివరించారు. ఎంపీపీ నర్సింలు, డీసీసీబీ అధ్యక్షుడు దుర్గారెడ్డి, సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వశంకర్ రావు, వెంకట్ రెడ్డి, నరేందర్, నరోత్తంరెడ్డి, పాండుగౌడ్, సాయికుమార్ గౌడ్, బాబు, రాజు పాల్గొన్నారు.

◆ రమాదేవికి ఘనంగా వీడ్కోలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు) తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 9ఏళ్లు సేవలందించి బదిలీపై వెళ్తున్న హత్నూర వెళ్లిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలితాసోమిరెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి రమాదేవి చేసిన కృషి మరిచిపోనిదని కొనియాడారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన ప్రజాప్రతినిధులకు, గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీహరి శంకర్, రేణుక, ఇందిరా, అనురాధ, రజిత, లలిత, మాధవి, సమీనా, ఆంజనేయులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

◆ పంటల సాగుపై పరిశీలన

జహీరాబాద్: హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని సెయింట్ మేరీస్ కళాశాలలో బీఏ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు జహీరాబాద్ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. సోమవారం న్యాల్‌కల్ మండలంలోని బసంత్‌పూర్‌లోని వ్యవసాయ కళాశాల, కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్‌లో సాగులో ఉన్న పలు పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీవేద, శాస్త్రవేత్త విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

◆ దిగ్వాల్ పాఠశాలలో మాక్ ఎన్నికలు

కోహీర్(జహీరాబాద్): విద్యార్థులలో ఎన్నికల పట్ల అవగాహన కల్పించేందుకుగాను మండలంలోని దిగ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జాకీర్ హుసేన్ ఆధ్వర్యంలో సోమవారం మాక్ ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మునిపల్లి(అందోల్): మండలంలోని మేళసంగ్యం గ్రామంలో సీసీ రోడ్డు పనులు మాజీ ఎంపీపీ రాంరెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సంగన్న, పంచాయతీ కార్యదర్శి వాణి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

◆ క్రషర్ల నిర్వహణపై విచారణ

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామ శివారులోని కంకర క్రషర్లతో ఇబ్బందులు పడుతున్నామని గత ఫిబ్రవరి 9న యువజన సంఘం ఆధ్వర్యంలో సెంట్రల్ మైండ్ సైన్స్ సేఫ్టీ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయంపై సోమవారం విచారణ నిమిత్తం మాదారం కంకర క్వారీలను సెంట్రల్ మెయిన్ సైన్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, రవీంద్రనాథ్ పాల్గొని పూర్తి విచారణ చేపట్టారు. కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు విజయ్గౌడ్, సుదర్శన్, రమణ, గణేష్, వెంకటేశంగౌడ్, చంద్రశేఖర్, కంకర క్వారీల యజమానులు పాల్గొన్నారు.

◆ మోటార్ సైకిళ్లు ఢీకొని ముగ్గురికి గాయాలు

వట్‌పల్లి(అందోల్): రెండు మోటర్ సైకిల్ వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలైన ఘటన సోమవారం అందోలు మండల పరిధిలోని అన్నాసాగర్ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంసాన్‌పల్లి గ్రామానికి చెందిన వర్దపాటి భీమయ్య, డప్పూరి అనుషమ్మ ఇద్దరు మోటార్ సైకిల్‌పై స్వగ్రామం నుంచి జోగిపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో జోగిపేట వైపు నుంచి స్కూటీపై ఎర్రారం గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి వస్తున్నాడు. అన్నసాగర్ చెరువు కట్ట మూలమలపు వద్దకు చేరుకోగానే రెండు ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయాలైన వారిని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

◆ ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మంగంపేట గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2010–2011లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

◆ ఉత్సాహంగా క్రీడాపోటీలు

04జడ్‌హెచ్‌ఆర్07: ముగ్గులు వేస్తున్న మహిళలు

జహీరాబాద్ టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామిక్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఆటల పోటీలను నిర్వహించారు. పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీ పార్కులో నిర్వహించిన ముగ్గులు, స్కిప్పింగ్, కబడ్డీ, పాటల పోటీల్లో మహిళలు పాల్గొన్నారు. గ్రామిక్ విజ్ఞాన కేంద్రం ట్రస్టీ డాక్టర్ విజయలక్ష్మి, సభ్యులు శ్వేత, లలిత, మీనా, న్యాయ నిర్ణేతలు రిటైర్డ్ టీచర్లు లక్ష్మి, సుమలత తదితరులు పాల్గొన్నారు. గెలుపొందినవారికి ఈ నెల 8వ తేదీన బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

◆ మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు

సంగారెడ్డి టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల మహిళా ఉద్యోగులకు టీఎన్జీవో ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. వివిధ శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 8వ తేదీన బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. డీఆర్‌వో పద్మజారాణి, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి లలితకుమారి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.